క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జ్యోతినగర్: తొమ్మిదో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం రుద్రంపూర్ సింగరేణి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో అండర్–8, 10, 12, 14 విభాగాల్లో పరుగు పందెం, లాంగ్‌జంప్, స్టాండింగ్ బ్రాడ్ జెంపు పోటీలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా నుంచి పోటీల్లో పాల్గొన్న నిశిత, అక్షిత, గణేశ్, కోడెం అశ్విత్, సాత్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

కటికెనపల్లిలో జగద్గురు బ్రహ్మోత్సవాలు

ధర్మారం: మండలంలోని కటికెనపల్లి గ్రామంలోని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16 వరకు జగద్గురు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు సద్గురు పాదసేవకులు కృష్ణహంస తెలిపారు. 12న గణపతిపూజ– విశేష అభిషేకాలు, 13న గోమాత పూజలు, కలశస్థాపన, బోనాలు, 14న కల్యాణ మహోత్సవం, 15న భగవద్గీత పారాయణం, ఉచిత కుంకుమార్చన, 16న ఆదిత్య యజ్ఞ మహోత్సవం, కుంబాభిషేకం నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ అరుణ

ధర్మారం: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వీవో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మహిళా సాధికారిక కోఆర్డినేటర్ దయా అరుణతో పాటు ఫైనాన్షియల్ లిట్రసీ సంధ్య హాజరై మాట్లాడారు. మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలికల చదువు ప్రాముఖ్యత వివరించారు. సఖి, అంగన్‌వాడీ సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్స్ తెలియజేసి వాటి పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ విజయలక్ష్మి, వీవో శిరీష, సఖి కోఆర్డినేటర్ స్వప్న, పారా మెడికల్ స్వప్న, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుకార్లను ప్రచారం చేయొద్దు

మంథని: పిల్లలను ఎత్తుకుపోయే ముఠా తిరుగుతుందనే పుకార్లను నమ్మొద్దని, అలాంటి ప్రచారం చేయొద్దని మంథని ఎస్సై కిరణ్‌కుమార్ అన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మి ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులుగా సంచరిస్తే 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

పెద్దపల్లిరూరల్: మహిళలు అన్నిరంగాల్లో ప్రతిభ కనబరిచి సాధికారిత సాధించాలని జెండర్ స్పెషలిస్టు సుచరిత, స్వప్న అన్నారు. పెద్దపల్లి కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. బేటీ బచావో.. బేటీ పడావో, లింగ వివక్ష, భ్రూణహత్యలు, బాల్యవివాహాలు, పోషకాహార విలువలు, పోక్సో చట్టం అమలు, తదితర అంశాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సీపీ స్వరూపతో పాటు వీవోఏలు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం అలవాటు చేయాలి



మాట్లాడుతున్న వనజ

జ్యోతినగర్: తరగతి గదిలో విద్యార్థులు ఉపాధ్యాయులను ప్రశ్నించేతత్వం అలవాటు చేయాలని ప్రఖ్యాత కౌన్సెలర్, ట్రైనర్ వనజ సూచించారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉపాధ్యాయులకు మోటివేషన్ క్లాసులో ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, హెచ్ఎం ఆరస్ జ్యోతి పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో మనోధైర్యం

- జిల్లాలోని కేజీబీవీ, హైస్కూల్స్, యూపీఎస్‌లోని బాలికలకు ఉచితంగా శిక్షణ
- కరాటేతో విద్యార్థుల్లో ఆరోగ్యం, ఏకాగ్రత పెంపు..



బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే బాలికలకు రాష్ట్ర ప్రభుత్వం 'రాణీ లక్ష్మీబాయ్ ఆత్మ పరిరక్షణ్' (సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం) కింద శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. 2023 డిసెంబర్ 1 నుంచి ఈ శిక్షణ ప్రారంభమైంది. మూడు నెలల పాటు పాఠశాలల్లో బాలికలకు కరాటే మాస్టర్ల సారథ్యంలో శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగానే జిల్లావ్యాప్తంగా హైస్కూల్స్, యూపీఎస్, కేజీబీవీలు మొత్తంగా 69 పాఠశాల ప్రాంగణాల్లో శిక్షణ శిబిరం కొనసాగుతోంది. బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కృషి చేస్తున్నారు. శిక్షణ ఇస్తున్న మాస్టర్‌కు ప్రతి నెలా రూ.ఐదు వేల గౌరవ భృతి అందజేయనున్నారు.

మనోధైర్యం, ఆరోగ్యం, ఏకాగ్రత పెంపు..

మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థినుల్లో మనోధైర్యం పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు. ఫలితంగా చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. దీంతో అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉంటుంది. వీటన్నింటితో పాటు వారిలో క్రమశిక్షణ అలవరుతుంది. వయసుకు తగిన ఎత్తు, బరువు పెరుగుతారు.

వినియోగించుకుంటున్న



మార్షల్ ఆర్ట్స్ ప్రయివేటుగా నేర్చుకోవాలంటే వేలాది రూపాయల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మా పాఠశాలలో ఉచితంగా నేర్పించడంతో సద్వినియోగం చే సుకుంటున్నాను. మా నాన్నకు ఫీజు చెల్లించి నేర్పించే స్తోమత లేదు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో మాలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

– నస్పూరి శిరీష, 9వ తరగతి, కేజీబీవీ, కుందనపల్లి

మెలకువలు పాటించాలి



మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న బాలికలు కొన్ని మెలకువలు పాటించాలి. సెల్ఫ్ డిఫెన్స్ అంటే తమను తాము కాపాడుకోవడం అన్నమాట. ఎదుటి వ్యక్తి చర్యలను ప్రతి చర్యలుగా తిప్పికొట్టగలిగే సామర్థ్యం కలిగి ఉండాలి. శిక్షణలో సాధారణంగా సాధన చేయాలి. వీటిని నిజ జీవితంలో ఎదురయ్యే ఘటనలకు జోడించి మెలకువలు ప్రదర్శించి ఆత్మరక్షణ కల్పించుకోవాలి.

– వడ్డెపల్లి నవీన, ఇన్‌స్ట్రక్టర్, కరాటే బ్లాక్‌బెల్ట్

ఏకాగ్రత పెరుగుతుంది



ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థినులు పుస్తకాలతో కుస్తీ పడతారు. సాయంత్రానికి మార్షల్ ఆర్ట్స్ శిక్షణకు హాజరవడంతో రిలాక్స్ అయి వారిలో ఏకాగ్రత పెంపొందుతుంది. నిత్యం ఒకే విధమైన సాధనలతో విద్యార్థినులు బోర్‌గా ఫీలయ్యే అవకాశం ఉంటుంది. మార్షల్ ఆర్ట్స్ సాధన విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి వారిలో చురుకుదనాన్ని పెంపొందిస్తుంది.

– పెద్దెల్లి పుష్పలత, పీఈటీ, కేజీబీవీ, కుందనపల్లి

రోజూ రెండుగంటలు సాధన



ప్రతి విద్యార్థినిలో నేర్చుకోవాలనే తపన స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతిరోజు సాయంత్రం రెండు గంటలు సాధన చేయిస్తున్నప్పటికీ తొందరగా సమయం గడిచిపోతోందని అంటున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మార్షల్ ఆర్ట్స్‌ను నిరంతరంగా సాయంత్రం ఒక పీరియడ్‌గా కొనసాగించాలని విద్యార్థినులు కోరుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలి.

– వడ్డెపల్లి సురేశ్, కరాటే మాస్టర్

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సుల్తానాబాద్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని శ్రీవాణి కళాశాలల చైర్మన్ రేకులపల్లి విజయ, కరస్పాండెంట్ శశాంక అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శనివారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్ కలాం చెప్పినట్లు విద్యార్థులు కలలు కనాలి ఆ కలలు సాకారం చేసుకోవడానికి తగినట్లు పట్టుదలతో కృషి చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఏకాగ్రతతో చదవాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్లు బాలసాని శ్రీనివాస్, బండారి కమలాకర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహజ్యోతి దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ



రిజిస్ట్రేషన్ చేస్తున్న విద్యుత్ అధికారులు

జ్యోతినగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా గృహజ్యోతి లబ్ధిదారుల దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. శనివారం రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ అంబేడ్కర్ భవన్‌లో శారదా నగర్ ఫీడర్ విద్యుత్ అధికారులు 5కౌంటర్ల ద్వారా దరఖాస్తుల రిజిస్ట్రేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీ అడిచెర్ల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తు లబ్ధిదారుల వివరాలను రిజిస్ట్రేషన్ చేస్తున్నామని పేర్కొన్నారు. 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారికి ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆవునూరి దేవస్వామి, లైన్‌మెన్ కుమారస్వామి, రఘురాం, రాకేశ్‌తో పాటు మాజీ కార్పొరేటర్ వెంగల పద్మలత, నాయకులు వెంగల బాపు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ట్రినిటిలో వార్షికోత్సవ హంగామా

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటి పాఠశాలలో శనివారం రాత్రి వార్షిక వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించి ఉన్నతంగా నిలిచి తల్లిదండ్రులకు సమాజంలో పేరు తేవాలని వక్తలు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. డీసీపీ చేతన, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ట్రినిటి చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ మోడల్ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులకు మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన బొద్దు నితిన్ (ఏఆర్ కానిస్టేబుల్) పరీక్ష సామగ్రిని ఉచితంగా అందజేశారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ప్రిన్సిపాల్ వీఎస్‌వీ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగో రోజు పారిశుధ్య కార్యక్రమాలు

ఎలిగేడు: మండలంలో శనివారం గ్రామగ్రామాన 4వరోజు ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు మండలస్థాయి అధికారులు పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, తహసీల్దార్ స్వర్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'విండో' చైర్మన్‌పై ఫిర్యాదు

ముత్తారం: ముత్తారం సింగిల్‌విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని అడవిశ్రీరాంపూర్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య ఆరోపించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. రాజిరెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సుతిలి, గన్నీ సంచులు, నిర్వహణతోపాటు సివిల్ సప్లయి, దీర్ఘకాలిక, పంట రుణాల్లో అవినీతికి పాల్పడ్డారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

మహాలక్ష్మి డాటా ఎంట్రీ

ఓదెల: మండలంలో తహసీల్దార్ యాకన్న ఆధ్వర్యంలో మహాలక్ష్మి డాటా ఎంట్రీని నమోదు చేశారు. శనివారం మండలంలోని కొలనూర్, గోపరపల్లె, ఓదెల గ్రామాల్లో మహాలక్ష్మి పథకం గురించి వివరాలు సేకరించారు.

సీనియర్ కాంట్రాక్టర్ మృతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్రాజెక్టులోని సీనియర్ కాంట్రాక్టర్ రంగినేని శ్రీరామారావు(70) శనివారం మృతి చెందారు. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో నివాసం ఉండే ఆయన ఎన్టీపీసీలో పలు కాంట్రాక్టు పనులు చేపట్టారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతితో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నియామకం

సుల్తానాబాద్: యునైటెడ్ పూలే ఫ్రంట్ జిల్లా కన్వీనర్‌గా బండారి శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించినట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ 12న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాలో బీసీ సంఘాల ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

పెద్దపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో కార్మికులంతా పాల్గొంటున్నారని సీఐటీయూ నాయకురాలు జ్యోతి, నాయకులు తుంగపిండి మల్లేశ్, కుమారస్వామి తెలిపారు. శనివారం జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు.

టీఎస్ఎంసీ కోఆప్షన్ సభ్యుడిగా డాక్టర్ ప్రణీత్



పెద్దపల్లిరూరల్: స్టేట్ మెడికల్ కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ ఎం ప్రణీత్ నామినేట్ అయినట్లు టీఎస్ఎంసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ మహేశ్ కుమార్ తెలిపారు. వీరి పరిపాలన కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు. ప్రణీత్ ఎన్నికపై కొండి సతీశ్, డాక్టర్లు నిశాంత్, రాజు, స్వరూప హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కొలనూర్ విద్యార్థి ప్రతిభ



సౌమ్యశ్రీ

ఓదెల: మండలంలోని కొలనూర్ హైస్కూల్ విద్యార్థి సౌమ్యశ్రీ షాట్‌పుట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. శనివారం కొత్తగూడెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని ఎంఈవో ఆరెపల్లి రాజయ్య, ప్రధానోపాధ్యాయులు ఏసుదాసు, పీఈటీ ప్రణయ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పంచాయతీ నిధుల వివరాలు చెప్పాలి

కాల్వశ్రీరాంపూర్: పందిల్ల గ్రామ పంచాయతీలో పన్నుల వసూళ్లు, వివిధ అభివృద్ధి పథకాలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులు జమా ఖర్చుల వివరాలు జాబితా ఇవ్వాలని పందిల్ల గ్రామస్తులు సమాచార హక్కు చట్టం కింద ఎంపీవో గోవర్ధన్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్తులు ఇచ్చిన దరఖాస్తు పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేసి వారి ఆదేశానుసారం నివేదిక ఇవ్వనున్నట్లు ఎంపీవో పేర్కొన్నారు. గ్రామానికి చెందిన కొజు కుమారస్వామి, గ్రామస్తులు ఉన్నారు.

పారిశ్రామిక సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.క్రిష్ణ కోరారు. శనివారం సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు ఇ.నరేశ్, తాళ్లపల్లి శ్రీనివాస్, నాగేశ్వరరావు, శాలిగామ మల్లేశ్, ఎండీ జాఫర్, పి.కిష్టయ్య, ఎం.కొమరయ్య, పి.మొండయ్య, ఐ.సాంబయ్య, రవికుమార్, రాజన్న, ఎ.చంద్రయ్య, వెంకటేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శ్రీవాణి జూనియర్ కళాశాలలో 12న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్య శిబిరం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



అశోక్‌ను సన్మానిస్తున్న స్థానికులు

ముత్తారం: మండలంలోని లక్కారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అశోక్ తమ తండ్రి స్మారకార్థంగా యూనిఫాం పంపిణీ చేశారు. ఈ మేరకు అశోక్‌ను శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అగ్గిమల్ల సతీశ్, పంజాల సాయిలుగౌడ్, బర్ల చంద్రమౌళి, సదన్, గానవేన కుమార్, సంకె సురేశ్, కిలొట్టి రమేశ్, నర్ర సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో సౌకర్యాలు కల్పించాలి



పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మీర్జంపేట గ్రామంలో మానేరు నదితీరంలో మూడేళ్లకోసారి నిర్వహించే సమ్మక్క జాతర ఏర్పాట్లను శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించారు. జాతరలో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అత్యవసర సర్వీసులైన మెడికల్ వైద్య శిబిరం, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ జాహెద్‌పాషా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేందర్‌కు సూచించారు. స్త్రీలకు స్నానఘట్టాలు, బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక వసతి, క్యూలైన్లు, టాయిలెట్లు ఏర్పాటు చేయాలని జాతర కమిటీకి సూచించారు. జాతర నిర్వహణ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జాహెద్ పాషా, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, మాజీ సర్పంచులు నాగార్జునరావు, కొమురయ్య, మాజీ ఎంపీటీసీ సదానందంగౌడ్, ఎంఈవో రాజయ్య, పీఆర్ఏఈ జగదీశ్, ఎస్సై శ్రీనివాస్, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ అశోక్, అభివృద్ధి కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో మొరాయిస్తున్న ఆన్‌లైన్



ఇబ్బంది పడుతున్న సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ప్రజాపాలన పథకంలో భాగంగా రూ.500కు వంటగ్యాస్ అర్హుల వివరాల సేకరణలో ఆన్‌లైన్ మొరాయిస్తుండడంతో ఇంటింటా తిరుగుతున్న ఆర్పీలు, అంగన్‌వాడీలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా బల్దియాలో సుమారు 15వేల లబ్ధిదారుల వివరాల సేకరణ కోసం ఇంటింటా సర్వే చేస్తున్నారు. గ్యాస్‌కోసం దరఖాస్తు చేసుకున్న అర్హుల ఎంపికలో భాగంగా దరఖాస్తులను ఇంటింటా తీసుకెళ్లి రేషన్‌కార్డు, ఎల్‌పీజీ కంపెనీ పేరు, కస్టమర్ నంబర్, పాస్‌బుక్ సంఖ్య, డెలివరీ రశీదులను పరిశీలించి అర్హుతలున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందు కోసం ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో ఆర్పీలు, అంగన్‌వాడీలు ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్నారు. అయితే శనివారం ఉదయం నుంచి ఆన్‌లైన్ మొరాయిస్తుండడంతో, అర్హుల వివరాలను నమోదు చేయడానికి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వే జరుగుతున్న తీరును శనివారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు పర్యవేక్షించారు. సర్వే పర్యవేక్షణ బాధ్యతలను డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావుకు అప్పగించారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్తులు



ఇసుక లారీలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో ఇసుక లారీలను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇసుక, ఎర్రమట్టి, దుబ్బి వరంగల్, పరకాల, భూపాలపల్లి జిల్లాల నుం వివిధ ప్రాంతాల నుంచి పారిశ్రామిక, పట్టణ ప్రాంతాల్లో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలకు, ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ వయా మంచిర్యాల, దేవపూర్, హైదరాబాద్, గోదావరిఖని, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రాంతాలకు లారీల ద్వారా రవాణా చేస్తున్నారు. దీంతో గ్రామంలో లారీల వేగంతో దుమ్ము లేచి వ్యాపారస్తులు, గ్రామస్తులు అనారోగ్యం పాలవుతున్నామని లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. లారీల ద్వారా ఇసుక, మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని వారు ప్రభుత్వానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

భారతరత్నతో పీవీకి సముచిత స్థానం



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: భారతరత్నతో భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావుకు సముచిత స్థానం లభించిందని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్ కొలిపాక సుజాత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ప్రధాన చౌరస్తాలో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు లక్ష్మణ్‌బాబు, బొమ్మక రాజేశ్, కొలిపాక మల్లయ్య, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు పాల్గొన్నారు.

తెలుగువారికి దక్కిన గౌరవం

కాల్వశ్రీరాంపూర్: మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు కేంద్ర సర్కార్ భారతరత్న ప్రకటించడం తెలుగు వారికి దక్కిన గౌరవమని ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ జూకంటి శిరీష, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి అన్నారు. శనివారం కాల్వశ్రీరాంపూర్‌లో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ సర్పంచులు శ్రీదేవి, నాగార్జునరావు, మల్లారెడ్డి, రమేశ్, తిరుపతిరెడ్డి, లావణ్య, రాజేశ్వరి, కొమురయ్యగౌడ్, శ్యాం, రాణి, చిరంజీవి, సుజాత, రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు రమాదేవి, నిర్మల, రాంచంద్రం, దేవయ్య, కౌసల్య, సదానందం, సంపత్, మానస పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



సన్మానిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి డైరెక్టర్(పా) ఎన్వీకే శ్రీనివాస్‌ను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ శనివారం కలిశారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. పర్సనల్, మెడికల్, లా విభాగాలు పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు రాజమౌళి, ధర్మపురి, సమ్మయ్య, లక్ష్మీపతిగౌడ్, శంకర్‌రావు, వికాస్‌కుమార్, అక్బర్అలీ, సదానందం తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ భవనానికి నిధులు మంజూరు



మంజూరు పత్రం అందజేస్తున్న రఘువీర్‌సింగ్

జూలపల్లి: మండల కేంద్రంలో రజక సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధుల మంజూరు పత్రాన్ని జిల్లా గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ సంఘ సభ్యులకు శనివారం అందజేశారు. సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.3లక్షల నిధుల మంజూరు పత్రాన్ని సభ్యులకు ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు నగునూరి నారాయణ, ఉపాధ్యక్షుడు శంకరయ్య, సభ్యులు భూమయ్య, గంగిపెల్లి శ్రీనివాస్, మల్లయ్య, ముక్కెర వెంకటేశం, భద్రయ్య ఉన్నారు.